# ఒక సినిమా కథ

నేను ఎక్కువగా సినిమాలు చూడను

సినిమాలగురించి నాకు ప్రత్యేకాభిప్రాయాలు ఏమీలేవు ఫలానారకం సినిమాలు బాగుంటాయనీ, ఫలానా రకంవి నాకు నచ్చవనీ – నేను ఎప్పుడూ అనుకోలేదు అయితే అప్పుడప్పుడు ఏదో ఒకటి చూస్తూనేఉంటాను. సాధారణంగా స్నేహితులెవరో ఒకరు నన్ను తీసుకుని వెళ్తూఉంటారు ప్రత్యేక మైన అసక్తి లేకపోయినా, ఎవరైనా స్నేహితులు నన్ను తీసుకునివెళ్తాంటేమటుకు నేను వాళ్ళ సంతోషంకోసం వాళ్ళ ప్రయత్నానికి అభ్యంతరం ఏమీచెప్పను అటువంటి స్నేహితులుకూడా నాకు రకరకాల అభిరుచులు ఉన్నవాళ్ళు ఉన్నారు

రామ్మూర్తికి కధలో పటుత్వం ఉన్న సీరియస్ సినిమాలు అంటే చాలాయిష్టం శాస్త్రికి హిందీ సినిమాలు అంతగా నచ్చవు దేవీప్రసాద్‌కి కొంచెం హుషారుగా, నా లు... 'హిట్‌సాంగ్స్'తో నడిచే సినిమాలంటే చాలాయిష్టం భారతదేశపు దారిద్ర్యం మటుకే చూపించే సినిమాలకి విదేశాలలో బహుమతినిర్ణేతలు బహుమతు లిస్తూఉంటారు అంటాడు దేవీప్రసాద్ తింటే ఆపిల్ పండే తిని, దొర్లితే కాశ్మీరు బయిళ్ళలోనే దొర్లే నాయకీ నాయకులున్న సినిమాలు వాస్తవానికి చాలా దూర మంటాడు రామ్మూర్తి ఇటువంటి వేర్వేరు అభిరుచు లున్న స్నేహితులందరితోటీ కూడా నేను అప్పుడప్పుడు సినిమాలకి వెళ్తూనే ఉంటాను నాకు ఈవిషయంలో అంతగా నిశ్చితమైన అభిప్రాయాలు ఏమీలేవు కాని, నేను ఒక్క విషయం మటుకు నమ్ముతాను, మనిషి 'మూడ్'ను బట్టి సినిమాలు అవసరం అన్ని సినిమాలూ అన్నివేళలా ఆనందించలేము

ఆరోజున ఆఫీసు విడిచిపెట్టాక ఏదైనా సినిమా చూడాలనిపించింది నా కోరిక నాకే చిత్రమనిపించిందికూడా అప్పటికే ఆరుగంట లవుతూంది నేను జీవితంలో ఒక్కణ్ణీ సినిమా చూసిన సందర్భాలు గుర్తు చేసుకుంటే వేళ్ళమీద లెక్కపెట్టవచ్చు నేమో! అదేరోజు ఉదయం ఎక్కడో 'సైన్‌బోర్డు' చూసిన గుర్తు, 'రహత్‌మహల్'లో 'సారంగ

"సుబ్బారావ్"

ధర' ఆడుతోందని, 'రహత్'లోకి చక్కని పాత సినిమాలు తరుచుగా వస్తూ ఉంటాయి, మిగతా సినిమాహాళ్ళతో పోల్చిచూస్తే, టిక్కెట్టు రేట్లుకూడా తక్కువ. యివన్నీ కారణాలు కావు, కానీ, ఆరాత్రి ఎందుకో 'సారంగధర' చూడడానికే నిర్ణయించుకున్నాను.

నేను సినిమాహాలు దగ్గిరికి చేరుకునే టప్పటికి చాలాబుకింగులు మూసివేశారు ఆటకూడా ప్రారంభమయింది పైక్లాసు లన్నీ నిండిపోయాయి ఆఖరిక్లాసు టిక్కెట్లుమటుకు యింకా అమ్ముతూనే ఉన్నారు సాధారణంగా క్రింద తరగతు లన్నీ ముందుగా మూసివేయడం మూలాన ఆరోజున ఎటువంటి పరిస్థితుల్లోనైనా సరే సినిమా చూడదల్చుకున్నవాళ్ళు అనుకున్నదానికంటె పైటికెట్టు కొనుక్కుని సినిమా చూడడం అలవాటు ఆ రోజున ఆ పరిపాటి తలక్రిందులయింది ఆ ఆఖరిటిక్కెట్టు కొనుక్కుని వెళ్ళ డమా, మానడమా అనేది కాసేపు తేల్చుకోలేకపోయాను

తెరకి దగ్గిరగా కూర్చోవడం జేబుకి మంచి దయినా కంటికి మంచిదికాదు – అనే ఆర్థికారోగ్య సూత్రంకంటెకూడా, ఎవరైనా చూస్తే ఏమనుకుంటారో అనే ఆలోచన నన్ను ఎక్కువగా పీడించసాగింది ఏమిచేయాలో తేల్చుకోలేని సమయంలో మహానుభావుడు, గాంధీగారు జ్ఞాపకం వచ్చారు ఆయన నిరాడంబరతని ప్రజలు ఎవరికి కావలసిన విధంగా వాళ్ల ఈ రోజునకూడా తమతమ ప్రయోజ నాల కోసం ఉపయోగించుకుంటూనే ఉన్నారు రైలులో మూడవతరగతి పెట్టెనీ, పల్లెటూళ్ళలో టూరింగ్ టాకీసు లలో నేలక్లాసునీ – 'గాంధీగారి క్లాసు' అంటున్నారు రైళ్ళలో వేరుశెనగపప్పు అమ్మేవాడు దానిని గాంధీగారి జీడిపప్పుగా అభివర్ణిస్తున్నాడు ఆలోచన యిలా పరి పరివిధాల పోతోంది. మనస్సుని కాస్త కట్టుదిట్టం చేసుకుని లోపల అడుగు పెట్టాను

వెళ్ళాక కొద్దిక్షణాలపాటు ఎక్కడ కూర్చోవాలా – అని ఆలోచించాను సినిమా అప్పటికే మొదలయిపోయింది కాబట్టి ఇంటర్వెల్‌వరకూ ఎవరూ చూచే ప్రమాదంలేదు ఇకపోతే ఇంటర్వెల్‌లో ఎవరికంటా పడకుండా తప్పించుకుంటే – ఆరోజున దిగ్విజయం లభించినట్లే బయ టికి పోవడానికి అనువుగా ఉంటుందని దగ్గిరగా ఉన్న ఒకసీటులో కూర్చు న్నాను నేను కూర్చున్న మరుక్షణంలో వెనకనుంచి ఏదోగొంతు పిలిచి, తనకు కనిపించడం లేదనీ, ఓ పక్కకు కూర్చోమనీ శాసించింది ఆ గొంతు చాలాకాలంనుంచి విన్నదానిలా ఉంది తెలియకుండానే వెనక్కి తిరిగిన నాకు క్షమార్పణ చెప్పినవాడు, మాకు రోజూ పాలూ, నీరూ ఒకేధరకి పోసే మల్లయ్య నా ప్రాణాలూ సగం, పైకి పోయాయి

వీడు నాగురుంచి ఏమనుకుంటాడో – అని ఒకటే ఆలోచన నేను సినిమా చూడడానికి వచ్చిన ఈ హాలులో అసలు టిక్కెట్టురేట్లే తక్కువ – అందులోనూ తీసుకున్నది ఆఖరి టిక్కెట్టు! నేను ఏ పరిస్థితుల్లో అది తీసుకున్నానో వాడికి ఏం తెలుస్తుంది? రేపుప్రొద్దున్న వాడు పాలచెంటుతో తలుపుమీద సుప్రభాతం పాడినప్పుడు నేను వాడికి చెప్పాలా? చెప్తే వాడు నమ్ముతాడా? నాకుగా నేను చెప్తే భుజాలు తడుముకుంటున్నా నని అనుకుంటాడా? వీడు రేపుప్రొద్దున మా శ్రీమతికి ఈ విషయం కాస్త చెప్పేస్తాడా? ఈ మిగతా కథంతా రేపుప్రొద్దున మా 'దోమతెర'లోంచి చూడాలి.

బలవంతాన దృష్టిని కాసేపు వెండితెరమీద నిలపడానికి ప్రయత్నం చేశాను అయినా పూర్తిగా నిలవడంలేదు పాలవాడు ప్రక్కవాడితో ఏదో చెప్పి నవ్వుతున్నాడు నా గురించి ఏదైనా 'జోకు' వేశాడో ఏమో? యింకా ఎవరైనా ఎరిగున్న మొహాలు ఉన్నాయేమో నని అటూయిటూ చూశాను ముందువరసలో కొంచెం దూరంగా మా తమ్ముడి సైకిలుకి గాలికొట్టే సైకిలుషాపు కుర్రవాడు కనిపించాడు వాడికి ఓవేళ మెడనెప్పి పుట్టి వెనక్కి తిరిగాడంటే నేను కనిపించడం తథ్యం భగవంతుడు వాడికి కాసేపు మెడనెప్పి కలగకుండా చూస్తే యిద్దర్నీ కాపాడినవాడవుతాడు! ఇంక ఎటువైపు చూడడానికీ కూడా ధైర్యం చాలలేదు ఈసారి మరొక కూరలబండి కుర్రవాడు కన్పించవచ్చును

సినిమామీద పూర్తిదృష్టి నిలపకపోయినా, సారంగధరుడిలా రామారావు బాగా నటిస్తున్నట్లే అనిపించింది, మళ్ళీ దృష్టి ఇటూ అటూ ఉన్నవాళ్ళమీద పడింది నాలాగే షర్టూ, ప్యాంటూ వేసుకున్నవాళ్లకూడా చాలామందే కనిపించారు బహుశః వాళ్లు వేసుకున్నవి ఖరీదైన బట్టలే అయివుంటాయి ఆ క్షణంలో నా చుట్టూ ఉన్న మనుష్యుల్లో ఎరిగున్నవాళ్లు కానీ, ముఖపరిచయం ఉన్నవాళ్లు కానీ, ఆఫీసర్లూ, డాక్టర్లూ ఇంజనీర్లూ, ప్రసిద్ధ రచయితలూ – కనిపిస్తే ఎంత బాగుంటుంది! అబ్బే – ఒక్కళ్ళు కూడా కనిపించలేదు ఆనవాయితిగా కాకపోయినా, నాలాగ దారి తప్పి పొరపాటునైనా ఎవళ్లూ వచ్చినట్లు లేదు ఇంటర్వెల్‌దాకా ఏమీ బెంగలేదు కాని, ఆ దీపాల వెలుగులో ఎవరికీ కనపడకుండా బయటపడాలి బయట పడుతూనే కొంచెం దూరంగా ఎక్కడికైనా వెళ్ళి ఒక్క సిగరెట్టు త్రాగాలి కథలో ఇంటర్వెల్ ఎప్పుడు వస్తుందో నాకు తెలియదు ఇంటర్వెల్ రాకముందు, "అయిదు నిముషాలలో ఇంటర్వెల్ వచ్చుచున్నది" అని ఓ స్లయిడు వేస్తే ఎంతబాగుంటుంది? మరిచేపోయాను, ఇంటర్వెల్ రాక ముందు

బయట వరండాలో దీపాలు వేసి, తలుపులు తెరుస్తారుగా! అప్పుడు బయటికి దాటిపోవాలి ఒక్కణ్ణీ ముందుగా వెడ్తే అందరి దృష్టీ నామీదే పడ్తుందేమో! కొంతమందిని వెళ్ళనిచ్చి ఆ తర్వాత వెడ్తేనే బాగుంటుందేమో? అసలు బయటికి వెళ్ళకుండా లోపలే కూర్చుంటే ఎలా ఉంటుంది? యిలా ఆలోచించుకుంటూనే, 'ఫాల్స్ ప్రిస్టేజ్' అనే మిధ్యా, 'సోషలిస్టు సమాజం' అనే కలా గుర్తుకు తెచ్చుకుంటూ, మనసుని మళ్ళీ అదుపులో పెట్టుకున్నాను

సినిమా అయిపోయింది అందులో ఏం చూశానో నాకే తెలియదు రిక్షా ఎక్కాలా, బస్సుకోసం ఆగాలా – అని కాసేపు తటపటాయించాను ఆ రోజున జరిగినవన్నీ నెమరువేసుకుంటూ – ఓ సిగరెట్టు ముట్టించాను ఆ వేళలో బస్సులు సులభంగా దొరకవు "చవకలో సినిమా చూశావు. అలా ఆదా చేసిన డబ్బులన్నీ మాకు పారెయ్యి" అన్నట్లుగా రిక్షావాళ్లు టాక్సీఫేర్స్ అడుగుతున్నారు కొంతదూరం నడిచి, ఆ తర్వాత ఓ రిక్షా ఎక్కాలని నడక సాగించాను.

నేనా రాత్రి యిల్లు చేరేటప్పటికి పది దాటింది. శ్రీమతి కొంచెం చిరాగ్గా కనిపించింది

"ఆలస్య మయిందనా కోపం?" అన్నాను.

సమాధానం రాలేదు విసురుగా వంటింట్లోకి వెళ్ళిపోయింది

"క్లబ్బులో బలవంతాన కూర్చోపెట్టేశారు ఏం చెయ్యను చెప్పు?"

దీనంగా ముఖం పెట్టాను

దానికీ సమాధానం రాలేదు

"మనసులో ఏముందో చెప్పకుండా ఏమిటా ముభావం?" కొంచెం చిరాగ్గా అన్నాను

"ఏమీ లేదు. ముందు భోజనానికి రండి" అంత చిరాగ్గానూ తనూ అంది

భోజనాల దగ్గిర పెద్దగా యింక ఏమీ సంభాషణ కాలేదు భోజనం చేస్తున్నంతసేపూ, ఈ సత్యభామ ఎందుకు అలిగిందా – అని ఆలోచిస్తూనే ఉన్నాను

పడుకోబోయేటప్పుడు తానే చెప్పింది

"ఈ రోజున స్నేహితు లందరూ బలవంతం చేస్తే మీతో చెప్పకుండా సినిమాకు వెళ్ళాను"

"ఓహ్ – అదా – నే నేదైనా అంటానని యిందాకణ్ణుంచీ భయపడుతున్నావా? యింతకీ ఏ సినిమాకి? మ్యాట్నీకి వెళ్ళారా?" క్షమించేశాననే ధోరణిలో మాట్లాడాను.

"ఏదైతే నేం కానీ – మీకు మరీ ఈ మధ్యన పొదుపు ఎక్కువై పోయిందే! సినిమాకి రూపాయి డబ్బులుకూడా ఖర్చుపెట్టలేక పోతున్నారా! మా స్నేహితు లందరిముందూ నా తల కొట్టేసినట్లయింది," అంది

అర్ధాంగి చెక్కిళ్లు దగ్గరగా ఉన్నాయి కాని అద్దం దూరాన ఉంది నా ముఖంలో మారిన రంగులు నాకు తెలియవు!